
# మనలో ఒకడు కాదు!

వడ్డి ఓంప్రకాశ్ నారాయణ

''మీ సినిమా వాళ్ళతో వచ్చిన ఇబ్బందే ఇదయ్యా! ఆఖరి నిమిషంలో వస్తారు... పనిచేస్తారా ఛస్తారా అంటారు. రూల్స్ గురించి చెప్పబోతే డబ్బులతో మా నోళ్ళు మూయిస్తారు'' ఎప్పటిలానే యూడీసీ వెంకటేశ్వర రావు నాకు క్లాస్ తీసుకున్నాడు.

అయినా ఆయన్ని అని తప్పులేదు. నిజంగానే మా సినిమావాళ్ళు అంతే. అన్నీ ఆఖరి నిమిషంలోనే ఫైనలైజ్ చేస్తారు. ఎలాగోలా పని జరగాల్సిందేనని అంటారు. నిజం చెప్పాలంటే ఇందులో నా తప్పేం లేదు. నేను కేవలం ప్రొడక్షన్ మేనేజర్ని. అందుకే ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎదుటి వ్యక్తి ఎన్ని మాటలు అన్నా పడాల్సిందే. పని చేయించుకోవాల్సిందే.



విషయం ఏమిటంటే... మా నిర్మాత బతికి చెడ్డ మనిషి. ఓ పెద్ద హీరోకు కెరీర్ ప్రారంభంలో ఈయనో హిట్ ఇచ్చాడు. ఆ తర్వాత ఈయనగారు తీసిన వన్నీ ఫ్లాప్ అయ్యాయి. దాంతో పూర్తిగా దివాళా తీసి, ఇక సొంత ఊరు వెళ్ళిపోదాం అనుకుంటున్న సమయంలో ఆ హీరోగారు పిలిచి డేట్స్ ఇచ్చారు. ఎక్కడ లేని శక్తీ కూడగట్టుకుని మా నిర్మాత సినిమా మొదలెట్టాడు. అయితే డబ్బులెక్కువ ముట్టచెప్పే నిర్మాతకు ఇచ్చే ప్రాధాన్యం మా 'సానుభూతి నిర్మాత'కు ఇవ్వలేరు గదా! అందువల్ల హీరోగారు ఇప్పుడో పది రోజులు, అప్పుడో పది రోజులూ కాల్షీట్స్ ఇస్తున్నారు. నిర్మాత కూడా కిమ్మనకుండా షూటింగ్ చేసుకుంటూ వెళుతున్నారు. అందువల్ల మా ప్రొడక్షన్ మేనేజర్లకే చిక్కులన్నీ ఏర్పడుతున్నాయి. ఇదిగో... ఇప్పుడు అలాంటి చిక్కుల్లోనే నేను చిక్కుకుని ఉన్నాను. ఎల్లుండి నుండి నాలుగు రోజుల పాటు షూటింగ్ చేసుకోమని

హీరోగారు ఆర్డర్ వేశారు. ఈ నాలుగు రోజుల్లో హీరో, హీరోయిన్ కాంబినేషన్‌లో బాలెన్స్ ఉన్న జైలు ఎపిసోడ్ కంప్లీట్ చేయాలన్నది డైరెక్టర్ ఆలోచన. ఇప్పుడు అర్జెంట్‌గా చర్లపల్లి జైలులో షూటింగ్ పర్మిషన్ తీసుకోవాలి. ఆ పని ప్రొడక్షన్ మేనేజర్‌గా నాదే. ఆఖరి నిమిషపు నిర్ణయాల్ని సైతం సక్రమంగా అమలు చేయగలనని నాక్కొంత పేరుంది. అందువల్లే చాలా మంది నిర్మాతలకు నేను పర్మనెంట్ ప్రొడక్షన్ మేనేజర్‌ని. అవతలి వ్యక్తిని ఏదో రకంగా ఒప్పించి పనిచేసుకు పోవడం నాకు చేతనౌను. అయినా మన దేశంలో డబ్బులకు కాని పనులుంటాయా? ఉండవనే సత్యాన్ని నేనీ రంగంలోకి వచ్చిన ఏడెనిమిదేళ్ళలో ఎన్నో సందర్భాలలో నిజం చేశాను.

చర్లపల్లి జైలులో షూటింగ్‌కు రోజుకు లక్ష రూపాయలు ఛార్జ్ చేస్తారు. నాలుగురోజులు షూటింగ్ కాబట్టి నాలుగు లక్షలు డిమాండ్ డ్రాఫ్ట్ కావాలి. అప్పటికే టైమ్ మధ్యాహ్నం రెండు గంటలు కావస్తోంది. క్యాషియర్‌ను బ్యాంక్‌కు పంపి డీడీ తెప్పించి, ఫిల్మ్‌నగర్ నుండి జైల్స్ డి.జి. ఆఫీస్ ఉన్న చంచల్‌గూడాకు వచ్చాను. ఇదిగో ఇక్కడ యూడీసీ వెంకటేశ్వరరావుతో మొదటి క్లాస్ పూర్తయింది.

XXX

"సార్! మీకు తెలియనిదేముంది. మా షూటింగ్ షెడ్యూల్స్ అన్నీ ఆఖరి క్షణంలోనే కన్‌ఫామ్ అవుతాయి. మీకు, నాకు ఇది కొత్త కాదు. కాస్త మా పర్మిషన్ లెటర్‌ను సూపరింటెండెంట్‌కు పంపితే మీ రుణం ఉంచుకోను గదా!" అన్నాను.

ఫైల్‌ను ముందు టేబుల్‌కు మూవ్ చేయాలంటే అక్కడ ఫార్మాలిటీస్ ఏమిటనేది నాకు తెలుసు. ఇప్పటికీ చాలా సార్లు ఇలా ఆఖరి నిమిషంలో వచ్చి పని చేయించుకున్నాను కూడా! అదే ధీమాతో షూటింగ్ ఏర్పాట్లు చేసేసుకోమని మా వాళ్ళకు చెప్పే వచ్చాను.

"చూడు, సుబ్రమణ్యం! ఇప్పుడు మాకు ఫణీంద్ర అని కొత్త సూపరింటెండెంట్ వచ్చారు. ఆయన అన్నీ రూల్స్ మాట్లాడతారు. నీకు తెలుసు గదా... షూటింగ్ పర్మిషన్ అంటే కనీసం నాలుగు రోజుల ముందు అప్లయ్ చేయాలి. ఇప్పటికి ఇప్పుడు వచ్చి ఎల్లుండి షూటింగ్ అంటే కుదరదు. నేనైతే ఫైల్‌ని వెంటనే ఆయన టేబుల్ మీదకు పంపుతాను. ఇంతకంటే నేనేం చేయలేను" అని చేతులు దులిపేసుకున్నాడు వెంకటేశ్వరరావు.

ఏ స్థాయి అధికారినైనా డీల్ చేయడం నాకు వెన్నతో పెట్టిన విద్యే. పైగా కొత్త వాళ్ళని డీల్ చేయడమంటే మరింత మజా అనిపిస్తుంది.

సూపరింటెండెంట్ ఫణీంద్ర క్యాబిన్‌లోకి వెళ్ళాను. చాలా సాదా సీదాగా ఉన్నాడాయన. డాబు – దర్పం ప్రదర్శించే వాళ్ళను డీల్ చేయడం కష్టం కానీ ఇలాంటి వాళ్ళను తేలిగ్గానే బుట్టలో వేసుకోవచ్చునన్నది నా అనుభవం నేర్పిన పాఠం. ఆయన్ని చూడగానే నా పని తేలిగ్గానే అయిపోతుందనిపించింది.

నన్ను చూడటంతోనే ఎదురుగా ఉన్న సీట్‌ను చూపించి, కూర్చోమని చెప్పారు.

ఓ నమస్కారం చేసి, కుర్చీలో కూర్చున్నాను.

"చెప్పండీ. నాతో ఏ పని ఉండి వచ్చారు?" అని అడిగాడాయన.

"సార్... నా పేరు సుబ్రమణ్యం. సినిమా ప్రొడక్షన్ మేనేజర్‌ని. ఎల్లుండి చర్లపల్లి జైలులో షూటింగ్‌కి పర్మిషన్ కావాలి. మీ యూడీసీ వెంకటేశ్వరరావుని అడిగితే, ఆయనేవో రూల్స్ మాట్లాడుతున్నారు. మీరు తల్చుకుంటే అవుతుంది. అందుకే మిమ్మల్ని కలవడానికి వచ్చాను" అని చెప్పాను.

సబార్డినేట్ గురించి ఆ స్థాయిలో ఫిర్యాదు చేస్తేనే పై వాళ్ళు మెత్తబడి తొందరగా లొంగిపోతారని నాకు తెలుసు. అయితే ఫణీంద్ర నుండి ఎలాంటి స్పందన రాలేదు.

"ఫైల్ నా టేబుల్ మీదకు రానివ్వండి. నేను చూస్తాను" అని అన్నారు.

నాకా సమాధానం చాలు. ఇక మిగిలిన విషయాలు నేను చూసుకోగలను.

"థ్యాంక్యూ సార్" అని చెప్పి ఆయన క్యాబిన్ లోంచి బయట పడ్డాను.

సెక్షన్‌లోకి రాగానే యూడీసీ వెంకటేశ్వరరావు 'ఏమైంది' అన్నట్టు కళ్ళెగరేశాడు. అంతా సజావుగా ఉంది అన్నట్టుగా ఓ చిన్న సైగ చేసి తలాడించాను దూరం నుండే. ఓ ఐదు నిమిషాల్లో వెంకటేశ్వరరావు నా ఫైల్‌ను అటెండర్‌తో సూపరింటెండెంట్ క్యాబిన్‌కు పంపి క్యాంటీన్‌కు వచ్చాడు.

అక్కడో సిగరెట్ ముట్టించి, టీ తాగుతుంటే, 'సుబ్రమణ్యం... నువ్వు సామాన్యుడివి కాదయ్యా! ఎవరితో నైనా పని చేయించుకోగలవు' అంటూ కితాబిచ్చాడు, నేనందించిన నజరానా స్వీకరిస్తూ.

"అన్నట్టు ఫణీంద్ర గారి ఇంటి అడ్రస్ చెప్పండి. ఇంకో అరగంటలో ఆయన ఇంటికి వెళ్ళిపోతారు కదా! ఆయనకి ముట్టచెప్పాల్సింది అక్కడే ఇస్తాను" అని అన్నాను.

ఈ మధ్యలో ఓసారి సైదాబాద్‌లోని స్నేహితుడిని కలిసొద్దామనిపించింది. వెంకటేశ్వరరావు నుండి శలవు తీసుకున్నాను.

XXX

సాయంత్రం ఆరు గంటలైంది.

చంచల్‌గూడా డీజీ ఆఫీస్ దగ్గరలోనే మలక్‌పేట గవర్నమెంట్ క్వార్టర్స్ ఉన్నాయి. అందులో ఫణీంద్ర ఇల్లు తెలుసుకోవడం పెద్ద కష్టం అనిపించలేదు. సహజంగా సూపరింటెండెంట్ స్థాయి అధికారులు క్వార్టర్స్‌లో ఉండరు. మా ఫిల్మ్ నగర్, జూబ్లీ హిల్స్, బంజారా హిల్స్‌లో చాలామంది ప్రభుత్వ అధికారులు భారీ భవంతులనే కట్టించారు. బహుశా అక్కడో ఇల్లు కట్టుకుని గవర్నమెంట్ క్వార్టర్స్‌లో ఉంటున్నారేమో అనిపించింది. బైక్‌ను ఇంటిముందు పార్క్ చేసి లోపలకు వెళ్ళాను. అప్పటికే ఇంటికి చేరిన ఫణీంద్ర సోఫాలో కూర్చుని టీ తాగుతూ టీవీలో వార్తలేవో చూస్తున్నారు. నన్ను చూడగానే ఆయన మొదట ఆశ్చర్యపోయారు.

నేను ఇంత త్వరగా ఆయన ఇంటికి వస్తానని ఊహించి ఉండరు.

ఎందుకైనా మంచిదని నన్ను నేను మరోసారి పరిచయం చేసుకుంటూ, "సార్... ఇందాక షూటింగ్ పర్మిషన్ కోసం మీ ఆఫీస్‌కు వచ్చాను. గుర్తుపట్టారా! మీరెలాగైనా రేపు నాకు పర్మిషన్ కాగితాలు ఇప్పించేస్తే ఎల్లుండి నుండి షూటింగ్ చేసుకుంటాం. మీకోసారి గుర్తు చేద్దామని వచ్చాను" అని నసుగుతున్న బిల్డప్ ఇచ్చాను చేతులు నలుపుకుంటూ.

ఆయన నా వంక తేరిపార చూశారు.

'కూర్చోండి' అని తన పక్క సోఫాలో చోటు చూపించారు.


ఫర్వాలేదు, ఆయన దారిలోకి వస్తున్నారనిపించి, కాస్త రిలాక్స్‌డ్‌గా కూర్చున్నాను.

'సునీత... అమ్మని టీ తీసుకు రమ్మను' అన్నారాయన.

పక్క గదిలోంచి ఓ ఇరవైయేళ్ళ అమ్మాయి 'అలాగే నాన్నగారూ' అంటూ వంటింటిలోకి వెళ్ళింది.

ఇంతలో ఓ పదిహేనేళ్ళ కుర్రాడు పెద్ద పుస్తకాల బ్యాగ్‌ను భుజాన వేసుకుని నీరసంగా ఇంట్లోకి అడుగు పెట్టాడు. 'ఈ కొత్త వ్యక్తి ఎవరా' అన్నట్లు నా వంక చూస్తూ.

ఫణీంద్ర చేతిని ఎలా తడపాలా అని ఆలోచిస్తూ, చుట్టూ పరికించి చూశాను. ఇల్లు కూడా ఆయన లానే సాదాసీదాగా ఉంది. మరీ నాకు ఆశ్చర్యం కలి



గించింది మా ఎదురుగా ఉన్న బ్లాక్ అండ్ వైట్ టీవీ. ఇంకా ఈ కాలంలో కూడా బ్లాక్ అండ్ వైట్ టీవీ చూసే వాళ్ళు ఉన్నారా అనిపించింది. ఇంతలో ఆయన భార్య టీ కలిపి తీసుకొచ్చి నా చేతికిచ్చింది. ఆవిడను గమనిస్తే నాకు మరింత ఆశ్చర్యం వేసింది. ఓ మామూలు గృహిణిలానే ఉంది. ఎక్కడా ఆర్భాటం లేదు. ఓ జైలు సూపరింటెండెంట్ ఇల్లు, ఆయన కుటుంబ సభ్యులు ఇంత సింపుల్‌గా ఉంటారా అనిపించింది నాకు. బహుశా ఈయన చాలా కష్టాల్లో ఉండి ఉంటారు. ఇలాంటి వాళ్ళతోనే నా పనులు సులువుగా అయిపోతాయి. ఈయన ఈ పోస్ట్‌లో ఉన్నంత వరకూ నాకు ఢోకాలేదు అనుకున్నాను.

టీ తాగుతుండగానే ఆయన చెప్పడం మొదలు పెట్టారు.

"ఇందాక ఆఫీస్‌లో మీ ఫైల్ చూశాను. ఎల్లుండి షూటింగ్ పెట్టుకుని ఇవాళ పర్మిషన్‌కు అప్లయ్ చేయడం కరెక్ట్ కాదు. కనీసం నాలుగు రోజుల ముందుగా మీరు అప్లయ్ చేయాలి. పైగా జైలులో మీరు చిత్రీకరించే సన్నివేశాలు ఏమిటనే వివరాలను కూడా మీరు మాకివ్వలేదు. ఇటువంటి స్థితిలో మీకు పర్మిషన్ ఇవ్వడం జరగదు" అన్నాడాయన.

ఇంత నిక్కచ్చిగా మాట్లాడటం నాకు షాక్ కలిగించింది.

'మీరు తల్చుకుంటే చేయగలరని ఇక్కడి వచ్చాను. ఎలాగైనా పర్మిషన్...' నేనేదో చెప్పబోయాను.

"నేను తల్చుకోను. ఎందుకంటే నిబంధనలకు వ్యతిరేకంగా నేనేదీ చేయను" అన్నాడాయన స్థిరంగా.

"మీరు చేసే సాయం నేనుంచుకోను. ఇందాక ఆఫీస్‌లోనే ఇద్దామనుకున్నాను. కానీ ఇంటి దగ్గర ఇస్తే మంచిదని ఇప్పటి వరకూ ఆగి వచ్చాను. మీరు కాదనకుండా ఈ కవర్ తీసుకుని కాస్త నా పని చేసిపెట్టండి. సినిమా షూటింగ్ అంటే లక్షలతో వ్యవహారం. ఒక్క రోజు షూటింగ్ ఆలస్యమైనా మా నిర్మాతకు నష్టం భారీగా ఉంటుంది. పైగా అందరి డేట్స్ సమకూర్చుకోవడం కూడా కష్టం" అన్నాను గొంతులో కొంచెం ఆర్ద్రతను మిళితం చేస్తూ, ఎంతైనా సినిమా వాడిని కదా!

నా మాటలకు సమాధానం చెప్పకుండా 'లక్ష్మీ నేనలా... ఈవినింగ్ వాక్‌కు వెళ్ళి వస్తాను' అన్నాడాయన వాళ్ళవిడకు వినిపించేలా.

అంటే ఇక నాతో మాట్లాడేదేమీ లేదని ఆయన చెప్పకనే చెబుతున్నాడా! నాకేమీ అర్థం కాలేదు. లేకపోతే ఇంట్లో భార్యా పిల్లల ముందు లంచం తీసుకోవడానికి మొహమాట పడుతున్నాడా!

నేనూ మౌనంగా ఆయనను అనుసరించాను.

రెండు సందులు దాటగానే ఓ పార్క్ వచ్చింది. ఆయన అందులోకి నడిచాడు. నేనూ ఆయనతో పాటే అడుగులు వేశాను. హాయిగా నేనిచ్చింది పుచ్చుకుని నాకు శలవు ఇప్పించక ఈ ఈవినింగ్ వాక్ ఎందుకు చేయిస్తున్నాడో అర్థం కాలేదు.

రెండు నిమిషాలు గడిచాక 'సార్...' అన్నాను నిదానంగా.

నా మీద నాకు నమ్మకం సన్నగిల్లుతోంది. ఈ తిక్క మనిషిని ఒప్పించగలనా లేదా అనే సందేహంలో పడిపోయాను. అయినా చివరి వరకూ ప్రయత్నిద్దామనే నిర్ణయించుకున్నాను.

'చెప్పండి...' అన్నట్లుగా చూశారాయన.

"మీకా పెళ్ళికెదిగిన కూతురుంది. టెన్త్, ఇంటర్ చదివే కుర్రాడు ఉన్నాడు. మీ ఆవిడను చూస్తే హౌస్ వైఫ్‌లానే ఉన్నారు. ఆవిడ మెడలో తాళిబొట్టు తప్పితే అరకాసు బంగారం కూడా నాకు కనిపించలేదు. మీ ఇల్లు చూస్తుంటే చాలా సాదాసీదాగా ఉంది. ఇప్పుడు సంపాదించుకోకపోతే ఎప్పుడు సంపాదించుకుంటారు? అయినా మీ అంత మీరేమీ అడగలేదు కదా! నేనే ఏదో నా సంతోషం కొద్దీ ఇస్తున్నాను. తీసుకోవడానికి మొహమాటపడకండి సార్" అన్నాను కాస్త చొరవ తీసుకుని.

ఆయన మౌనంగా మరో నాలుగు అడుగులు ముందుకేసి, ఓ సిమెంట్ బల్ల మీద కూర్చున్నాడు. నేనూ ఆయన పక్కనే కూర్చున్నాను.

"ప్రభుత్వాధికారులకు లంచం ఇచ్చి పని చేయించుకోమని మీకెవరయ్యా చెప్పింది?' అన్నాడాయన.

నిజానికి నా దగ్గర ఆ ప్రశ్నకు సమాధానం లేదు. మౌనం వహించాను.

"మీ పనులు సక్రమంగా చేయడం కోసమే మాకు ప్రభుత్వం జీతాలు ఇస్తోంది. నిజానికి మేం మీకు సర్వెంట్స్ గానీ ప్రభుత్వానికి కాదు. కాబట్టి మాతో పని చేయించుకోవడం మీ హక్కు. అందుకోసం లంచం ఆశ పెట్టనక్కర్లేదు" అన్నాడాయన చాలా మామూలుగా.


Our Wish HEALTH FOR ALL our Promise
HEALTH INSURANCE FOR ALL



★ GOOD HEALTH POLICY
★ UNIVERSAL HEALTH POLICY
★ MEDICLAIM POLICY
★ NAGRIK SURAKSHA POLICY
★ OVERSEAS MEDICLAIM POLICY

ORIENTAL INSURANCE

Prithvi. Agni. Jal. Aakash.
Sab ki suraksha hamare paas

THE ORIENTAL INSURANCE COMPANY LTD.
REGIONAL OFFICE-HYDERABAD 6-3-871, SNEHALATHA, GREENLANDS, HYDERABAD-500016
VISIT US AT: orientalinsurance.nic.in e-mail: hyd2_oichyd@sancharnet.in
INSURANCE IS THE SUBJECT MATTER OF SOLICITATION

ఒక్క క్షణం ఆయన మాటలు నాకు అర్థం కాలేదు. ఓ జైలు సూపరిటెండెంట్ మాట్లాడే మాటలేనా ఇవి. నేనింతవరకూ ఈ తరహా మాటల్ని ఏ ప్రభుత్వ అధికారి నోటివెంటా వినలేదు. అయితే నన్ను నేను సమర్థించుకునే ప్రయత్నంలో "ఇది లంచంగా ఇస్తోంది కాదు సార్. మా సంతోషం కొద్దీ..." అని ఈ సారి నిజంగానే నసిగాను.

"అది కూడా తప్పే. ఎదుటి వ్యక్తి ఆశించకుండానే మీరు లంచం ఇవ్వడం మొదలు పెడతారు. ఊహించని ఈ డబ్బుకు అలవాటు పడే వ్యక్తి ఆ తర్వాత, తనకు కావాల్సింది ఇస్తే కానీ మీ పని చేయలేని స్థితికి వస్తాడు. అవునా... కాదా" అన్నాడాయన నన్ను నిలదీస్తూ.

నేను కార్నర్‌లో పడ్డాను. అవునన్నట్టుగా తలూపాను. అయినా కాస్త గొంతు పెగల్చుకుని "సార్! మీకిచ్చే జీతాలు మీ కుటుంబానికి సరిపోవు కదా! కాబట్టి ఇటువంటివి తీసుకోవడం మరీ తప్పు కాదేమో" అన్నాను.

"నిజమే, వచ్చే జీతం మన కోరికల్ని తీర్చకపోవచ్చు. అయితే ఎంత జీతం వస్తే లేదా ఎంత మొత్తం సంపాదిస్తే మన కోరికలు తీరతాయి? వాటికేమైనా కొలమానం ఉందా? వచ్చిన దానితో తృప్తి చెంది, అందులో సర్దుకుపోవడంలోనే మన గొప్పతనం ఉంది. అప్పుడే జీవితాన్ని ఆస్వాదించగలుగుతాం. కావాల్సినంత సంపాదించుకోవాలనే కోరిక మనసులో తిష్టవేస్తే సంపాదించడంతోనే జీవితం గడిచిపోతుంది" అన్నాడాయన.

"అందరూ మీలా ఉండరు కదా! డబ్బులిస్తేనే ఇవాళ ఎక్కడైనా పనులు జరుగుతాయి. మా అనుభవాలే మమ్మల్ని ఇలా లంచాలు ఇచ్చేట్టు చేశాయి సార్" అన్నాను.

ఓ క్షణం ఆయన తీవ్రంగా నా వంక చూశారు. "లేదు. నేనలా అనుకోవడం లేదు. నాకింకా ఈ మనుషుల మీద, ఈ వ్యవస్థ మీద నమ్మకం ఉంది. అందుకు నేనే ఓ ఉదాహరణ. నేను పాతికేళ్ళ క్రితం హైదరాబాద్‌కు వచ్చాను. ఓ చిన్న ఆఫీస్‌లో క్లర్క్‌గా రెండు వందల రూపాయలకు పనిచేశాను. అప్పట్లో పేపర్లో పడిన ప్రకటనొకటి చూసి జైళ్ళ శాఖలో ఉద్యోగం కోసం దరఖాస్తు చేశాను. మా కేటగిరిలో ఉన్నది ఒక్కటే పోస్ట్. దానికే వందమంది వరకూ పోటీ పడ్డారు. రాత పరీక్షలో అత్యధిక మార్కులు వచ్చిన పదిమందిని తుది పరీక్షకు ఎంపిక చేశారు. ఎవరికి వారు తమ తమ స్థాయిల్లో ఆ పోస్ట్‌ను దక్కించుకోవడానికి ప్రయత్నించారు. నాకే పరిచయాలు లేవు. డబ్బులు లంచంగా ఇచ్చే స్తోమతా లేదు. అయినా నా మీద నాకు నమ్మకం ఉంది. అప్పట్లో తివారీ ఐ.జి.గా ఉండేవారు. ఈ ఒక్క పోస్ట్ కోసం ఆయన బంధువులు, మిత్రులు, పై అధికారులు, ఆఖరికి మంత్రులు కూడా ఆయన మీద ఒత్తిడి తీసుకొచ్చారు. కానీ ఆయన ఏ ప్రలోభాలకూ లొంగలేదు. అర్హులకే ఆ ఉద్యోగం ఇవ్వాలని అనుకున్నారు. ఆ కారణంగా నాకీ ఉద్యోగం వచ్చింది. ఆ నిజాయితీపరుడు పెట్టిన భిక్ష నాకిది. కాబట్టి నే సర్వీస్‌లో ఉండగా ఎప్పుడూ ఒక్క పైసా కూడా లంచం తీసుకోకూడదని అనుకున్నాను. నా కృతజ్ఞతలను తివారీ గారికి అలా తెలపాలనుకున్నాను" అన్నారాయన చిప్పిల్లిన కళ్ళతో.

నేను అవాక్కయ్యాను. తనకు ఉద్యోగం ఇచ్చిన వ్యక్తికి ఇలా కృతజ్ఞతలు తెలిపే వాళ్ళు కూడా ఉంటారా అనిపించింది.

కాసేపు మౌనం వహించి, తర్వాత ఆయనే అన్నారు "ఇదంతా నీకు ఎందుకు చెబుతున్నానంటే అన్ని శాఖల్లానే మా శాఖలోనూ కొందరు అవినీతిపరులు ఉండొచ్చు. డబ్బుకు ఆశపడి దొడ్డి దారిన నీకు పనిచేసి పెడుతుండవచ్చు. దానిని నువ్వు ప్రోత్సహించడం సరైంది కాదు. నిజంగా నీకేదైనా అవసరం మా డిపార్ట్‌మెంట్ నుండి కావాల్సి వస్తే నిర్భయంగా అడుగు. డి.జీ. గారితో మాట్లాడి నేను పర్మిషన్ ఇప్పిస్తాను. దయచేసి తటస్థుల్ని కూడా మీ అవసరాల కోసం లంచగొండుల్ని చేయొద్దు" అన్నారాయన నా భుజాన్ని తడుతూ.

నేనేమీ మాట్లాడకుండా, ఆయన నుండి శలవు తీసుకున్నాను.

XXX

మా ప్రొడక్షన్ ఆఫీస్‌కు వచ్చానన్న మాటే కానీ నా మనసు మనసులో లేదు. మొదటిసారి డబ్బుతో చేయలేని పనులు కూడా ఉంటాయని తెలుసుకున్నాను. చాలా సందర్భాలలో ఓ పౌరుడిగా నా హక్కుని ఉపయోగించుకోకుండా, అవసరం ఉన్నా లేకపోయినా అడ్డమైన వాడికీ చేతులు తడిపి ఈ వ్యవస్థకు నేనూ కళంకం తెచ్చాను కదా అనిపించింది. తలంతా భారంగా ఉంది. కుర్రాడితో చాయ్ తెప్పించుకుని తాగుతుంటే మా ప్రొడ్యూసర్ నుండి ఫోన్ వచ్చింది.

"సుబ్రమణ్యం... హీరోగారు చెన్నై నుండి రావడానికి మరో నాలుగు రోజులు పడుతుందట. జైల్లో షూటింగ్ వాయిదా పడినట్టే. కాబట్టి నాలుగు రోజుల తర్వాతకే పర్మిషన్ తీసుకో" అన్నారాయన.

నా నెత్తిన పాలు పోసినట్టయింది.

వెంటనే అసిస్టెంట్ డైరెక్టర్‌ను పిలిచి జైల్లో చిత్రీకరించాల్సిన సన్నివేశాల వివరాల్ని తెల్లారేసరికి సిద్ధం చేయమని చెప్పాను. ఎందుకో తెలియదు గానీ ఆ రాత్రి నాకు ప్రశాంతంగా నిద్ర పట్టింది.

XXX

మర్నాడు పదిగంటలకే చంచల్‌గూడా డీ.జీ. ఆఫీస్‌కి వెళ్ళాను. ఈసారి డైరెక్ట్‌గా ఫణీంద్ర గారి క్యాబిన్‌కే. ఆయన ఏదో ఫైల్ చూస్తున్నారు. నన్ను గమనించి కూర్చోమన్నట్టుగా సైగ చేశారు. రెండు నిమిషాల తర్వాత తలెత్తితే, "సార్... పేపర్లు అన్నీ సిద్ధం చేశాను. మా షూటింగ్ కూడా పోస్ట్‌పోన్ అయింది. నాలుగురోజుల తర్వాతకే పర్మిషన్ కావాలి. నిన్న మీరు నా ప్రలోభాలకు లొంగి పర్మిషన్ ఇచ్చినా మేం షూటింగ్ చేయలేకపోయే వాళ్ళం. తెలిసో తెలియకో మా నిర్మాతకు మీరు చాలా హెల్ప్ చేశారు" అని అన్నాను.

ఆయన చిరునవ్వు నవ్వారు.

"సార్! మీరేమీ అనుకోకపోతే... జస్ట్ ఈ స్వీట్ ప్యాకెట్ తీసుకోండి. నా తృప్తి కోసం" అని అభ్యర్థించాను.

'నో... థ్యాంక్స్' అన్నారు ఫణీంద్ర అదే చిరునవ్వుతో.

ఆయన తిరస్కారం కూడా నాకెందుకో తెలియని ఆనందాన్ని కలిగించింది.

రెండు చేతులూ జోడించి ఆయన దగ్గర నుండి శలవు తీసుకున్నాను.

'ఆల్ ద బెస్ట్' అన్నారాయన వెనక నుండి.

డీజీ ఆఫీస్ నుండి ఇవతలకు రాగానే పక్కనే ఉన్న అనాథ శరణాలయం ఆవరణ బయట నలుగురైదుగురు పిల్లలు ఇసుకలో పిచ్చిక గూళ్ళు కడుతూ కనిపించారు. నా బైక్‌ను వాళ్ళ దగ్గరకు పోనిచ్చి ఆపి, సైగ చేసి పిలిచాను.

పరిగెత్తుకుంటూ వచ్చారు వాళ్ళు.

నా చేతిలోని స్వీట్ ప్యాకెట్‌ను వాళ్ళకిచ్చాను.

ఆశ్చర్యంగా దానిని అందుకుంటూ 'థ్యాంక్స్ అంకుల్...' అన్నారు.

నేను బైక్ స్టార్ట్ చేసి వెనక్కి తిప్పుతుంటే ఏదో గుర్తు కొచ్చినట్టుగా 'అంకుల్ మీ పేరు....' అని అరిచాడో కుర్రాడు.

'ఫణీంద్ర' అని చెప్పాను.

